రేపు 'ప్రజావాణి' రద్దు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 3: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 5న రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, వచ్చే సోమవారం యథావిధిగా ప్రజావాణి ఉంటుందని కలెక్టర్ తెలిపారు.



అయ్య భౌ బోయ్

- వాహనాల వెంటపడి పరుగులు పెట్టిస్తున్న శునకాలు
- గాయాలపాలవుతున్న చిన్నారులు, వాహనదారులు
- నిలిచిన బర్త్ కంట్రోల్ చర్యలు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 3: వీధి కుక్కలు పేట్రేగి పోతున్నాయి. పిల్లలు, వృద్ధులు, మహిళలే కాదు ఎవరినీ వదిలిపెట్టకుండా మీదపడి తీవ్రంగా గాయపరుస్తున్నాయి... కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీల్లోనే కాకుండా అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్ర వాహనదారులను వెంబడించి పరుగులు పెట్టిస్తున్నాయి... వీధికుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మరీ ముఖ్యంగా రాత్రివేళల్లో రోడ్లపైకి గుంపుగుంపులుగా వచ్చి రోడ్లపై నుంచి వెళ్లే వారిపై దాడులు చేస్తుండడంతో కుక్కలు కనబడితే చాలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

ప్రతీ రోజు జిల్లాలో ఏదో ఓ చోట..

ప్రతి రోజు జిల్లాలో ఎక్కడో ఒక చోట వీధి కుక్కలబారిన పడి గాయపడిన సంఘటన జరుగుతూనే ఉంది. ఇటీవల హుజూరాబాద్‌లో వరుసగా వీధికుక్కలు వెంటపడి గాయపరిచిన సంఘటనలను మరిచిపోక ముందే రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓ మహిళ ప్రాణాలను బలిగొన్నాయి. ఇలా ఇప్పటి వరకుఎంతో మంది వీధికుక్కల బారినపడి తీవ్రగాయాల పాలయ్యారు.

నియంత్రణ చర్యలేవి?

వీధి కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు, వాక్సినేషన్ నామమాత్రంగా జరుగుతోంది. దీంతో జిల్లావ్యాప్తంగా కుక్కల సంఖ్య సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. కొన్నాళ్లుగా కరీంనగర్ కార్పొరేషన్ పరి. దిలో కుక్కలకు బర్త్ కంట్రోల్ చేసే శస్త్రచికిత్సలను పూర్తిగా నిలిపివేశారు. కుక్కలను తీసుకువచ్చి వాటికి వాక్సినేషన్ చేసి బర్త్ కంట్రోల్ చికిత్స చేసేందుకు అవసరమైన స్థలం, సిబ్బంది లేరు. ఈ ప్రక్రియను వేగవంతంగా చేపట్టేందుకు అవసరమైన నిధులు, ఇతరత్రా సౌకర్యాలు కల్పించక పోవడం మరో కారణం. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే ఈ యేడాదిలో దాదాపు 450 మంది వీధి కుక్కల దాడిలో గాయపడ్డారని అధికారులు చెబుతున్నా ఆ సంఖ్య రెట్టింపునకుపైనే ఉంటుంది. రామడుగు మండలం తిర్మలాపూర్ గ్రామంలో ఒకేరోజు 10 మందిపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి.

కరీంనగర్‌లో 10 వేలకుపైగా కుక్కలు



ఇక కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో కుక్కలు, పందుల బెడద విపరీతంగా ఉందంటూ కార్పొరేటర్లు ప్రతి సమావేశంలో ఏకరువు పెడుతూనే ఉన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో 10 వేలకుపైగా వీధికుక్కలున్నట్లు అధికారులు గుర్తించారు. 821 కుక్కలకు బర్త్ కంట్రోల్ శస్త్రచికిత్స చేసి యాంటీరెబీస్ వాక్సిన్, నట్టల నివారణ మందులను వేసి వదిలిపెట్టారు. వీధికుక్కలు, పశువుల బెడద నివారించేందుకు ఇటీవల బొమ్మకల్ గ్రామశివారులో ఎకరం స్థలాన్ని కలెక్టర్ నగరపాలక సంస్థకు కేటాయించారు. అక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. నగర శివారులోని విద్యానగర్, శ్రీరాంనగర్ కాలనీ, సప్తగిరికాలనీ, శ్రీనగర్‌కాలనీ, జ్యోతినగర్, రేకుర్తి, సుభాష్‌నగర్, నాకా చౌరస్తా, కార్ఖానగడ్డ, హౌసింగ్‌బోర్డుకాలనీ, వావిలాలపల్లి, కాశ్మీరుగడ్డ, సప్తగిరికాలనీ, గోదాంగడ్డ, రాంపూర్ వంటి ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వీధికుక్కలను, పశువులను ప్రత్యేక స్థలానికి తరలించి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత నగరపాలక సంస్థపై ఉంది. ఈ విషయంపై నగరపాలక సంస్థ పాలకవర్గం, అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.



రేపటి నుంచి శ్రావణ మాసం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 3: పవిత్ర శ్రావణమాసం సోమవారంతో ప్రారంభమవుతోంది. 8వ తేదీ నుంచి 28 వరకు శుభ ముహూర్తాలు ఉన్నాయి. పండుగలు, నోములు, వ్రతాలకు అనుకూలమైన మాసం కావడంతో మహిళలు ఈ నెలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. కొత్త నోములు, వివిధ దేవతల వ్రతాలు ఆచరిస్తారు. ఆలయాల్లో పూజలు, అభిషేకాల సందడి నెలకొననుంది. రాఖీ పౌర్ణమి, కృష్ణాష్టమి ఇదే మాసంలో వస్తాయి.

నేడు చుక్కల అమావాస్య

ఆషాఢమాసం బహుళ పక్షంలో వచ్చే చివరి అమావాస్యను చుక్కల, అల్లరి, దిశా అమావాస్యగా పిలుస్తారు. ఆదివారం చుక్కల అమావాస్య సందర్భంగా గౌరీమాత పూజలు నిర్వహించనున్నారు. రైతులు తమ వ్యవసాయ పనుల్లో నిమగ్నమై అమ్మవారి దయతో పంటలు బాగా పండాలని కోరుకుంటారు. గ్రామ, కుల, పొలిమేర దేవతలకు పూజలు నిర్వహిస్తారు.



మహాశక్తి దేవాలయం

మూడు నెలల్లో 'ఎల్‌ఆర్‌ఎస్' ప్రక్రియను పూర్తి చేయాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 3: రాష్ట్రంలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం మూడు నెలల్లో పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు సంబంధించి అనుసరించాల్సిన విధానంపై సంబంధిత అధికారులతో సమీక్షించి, న్యాయపరమైన దరఖాస్తుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను మొదలు పెట్టామని చెప్పారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించేందుకు అవసరమైన సపోర్టు సిస్టంను అధికారులకు పూర్తిస్థాయిలో అందిస్తామని అన్నారు. 2020 నాటి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై ప్రజాప్రభుత్వంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా, ప్రభుత్వానికి నష్టం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ద్వారా ప్రభుత్వ భూములకు నీటి వనరులు, కాలువలు, చెరువులకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ 2020 కింద 25,70,708 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిలో ఇప్పటి వరకు 4,28,832 దరఖాస్తులను పరిశీలించి 60,213 దరఖాస్తులను ఆమోదించి క్రమబద్ధీకరించామని తెలిపారు. ఇంకా 20 లక్షలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, నాలుగు దశల్లో స్క్రూటినీ చేస్తామన్నారు. కలెక్టర్ పరిధిలోని ప్రతి గ్రామానికి, మున్సిపాలిటీకి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ వివరాలు సమర్పించాలన్నారు. స్క్రూటిని అనంతరం అదనపు కలెక్టర్ ధ్రువీకరణతో ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్ జారీ అవుతాయని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీపీవో రవీందర్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి

గుడుంబా, గంజాయిపై కొరడా

- ఆరు నెలల్లో 365 లీటర్ల నాటుసారా సీజ్, 30 మంది అరెస్టు
- 13 కిలోల గంజాయి పట్టివేత, 9 కేసుల్లో 16 మంది అరెస్టు



కరీంనగర్ క్రైం, ఆగస్టు 3: గుడుంబా, గంజాయిని అరికట్టేందుకు ఎక్సైజ్ సిబ్బంది పలు చర్యలు తీసుకుంటోంది. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో వ్యూహాత్మకంగా అడుగులు ముందుకు వేసున్నారు. గుడుంబాతోపాటు నిషేధిత గంజాయి, ఇతర మత్తు పదార్థాల అమ్మకాల నియంత్రణ, కల్తీ కల్లు తయారీ అమ్మకాలు, అక్రమ మద్యం, కల్లు, బెల్లం, ఇతర నిషేధిత పదార్థాల అమ్మకాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇతర ఎక్సైజ్ విభాగాల ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత దాడులు నిర్వహిస్తున్నారు. గడిచిన ఆరు నెలల్లో(జనవరి నుంచి జూన్ వరకు) జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 885 కేసులు నమోదు చేశారు. 365 లీటర్ల నాటుసారా సీజ్ చేశారు. గుడుంబా తయారీ, అమ్మకాలు సాగిస్తున్న 30 మందిని అరెస్టు చేశారు. 13 కిలోల గంజాయి పట్టుకుని తొమ్మిది కేసుల్లో 16 మందిని అరెస్టు చేసి రిమాండ్ చేశారు. 9,115 కిలోల బెల్లం సీజ్ చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై 470 కేసులు నమోదు చేసి, 288 మందిని అరెస్టు చేశారు. 3,280 లీటర్ల మద్యం, 3,309 లీటర్ల బీర్ సీజ్ చేశారు. నిబంధనలు విరుద్ధంగా నిర్వహిస్తున్న మద్యం షాపులపై 13 కేసులు నమోదు చేసి జరిమానాను విధించారు. అక్రమంగా కల్లు విక్రయాలకు సంబంధించి 295 కేసులు నమోదు చేసి, 63,366 లీటర్ల కల్లును సీజ్ చేశారు. అక్రమ మద్యం, గుడుంబా, గంజాయి కేసులకు సంబంధించిన 582 మందిని సంబంధిత తహసీల్దార్ల ఎదుట హాజరుపరచి మళ్లీ అక్రమాలకు పాల్పడకుండా బైండోవర్ చేశారు.

సప్తగిరికాలనీలో తల్లిపాల వారోత్సవాలు

సుభాష్‌నగర్, ఆగస్టు 3: ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోజూట సప్తగిరి కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అదికారి సరస్వతి తల్లిపాల ప్రాధాన్యాన్నివివరించారు.డాక్టర్ అఖిల మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవా ల్సిన టీకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివ రించారు. కార్యక్రమంలో ఎం స్వప్న, మమత, హరిప్రియ, ఉష, స్వయంప్రభ, సునీత, రోమీల పాల్గొన్నారు.

అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం

తిమ్మాపూర్, ఆగస్టు3: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల శ్రీ తాపాల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆవరణలో శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరునగరి వెంకటాద్రి ఆధ్వర్యంలో జరుగగా ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు వింజమూరి సుధాకర్ పాల్గొన్నారు. అర్చకుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గల్ఫ్‌లో మల్లారెడ్డిపేట వాసి మృతి

● దుబాయ్‌లో పనిలేక ఆర్థిక ఇబ్బందులు
● స్వగ్రామానికి మృతదేహం

గంభీరావుపేట, ఆగస్టు 3: మండలంలోని మల్లారెడ్డిపేటకు చెందిన గెరిగంటి అంజయ్య(55) దుబాయిలో 45 రోజుల క్రితం మృతి చెందాడు. మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరింది. ఆరేళ్ల కిందట కూతురు పెళ్లి చేసిన అంజయ్య అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చేందుకు అంజయ్య దుబాయి వెళ్లి ఓ కంపెనీలో పనికి కుదిరాడు. కొద్ది రోజులకే ఆ కంపెనీ మూసివేయడంతో రోడ్డున పడ్డాడు. అక్కడ పనిలేక, అప్పులు తీర్చే మార్గం లేక మానసిక ఆందోళనకు గురయ్యాడు. చేద్దామంటే పనిలేక ఎవరూ పట్టించుకోకపోవడంతో దొరికిన నాడు తింటూ దొరకని నాడు పస్తులుంటూ వచ్చాడు. దీంతో సరిగ్గా ఆహారం లేక అనారోగ్యం పాలయ్యాడు. రోజురోజుకు గల్ఫ్‌లో అంజయ్య ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. చివరికి ఫుట్‌పాత్‌పైనే అంజయ్య తుదిశ్వాస విడిచాడు. పాస్‌పోర్ట్ కంపెనీ యాజమాన్య వద్దే ఉండిపోవడంతో మృతదేహం స్వదేశానికి తీసుకురావడానికి ఇబ్బంది ఏర్పడింది.

స్థానిక నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందిం చిన ఆయన ఇండియన్ ఎంబసీ లెటర్ పంపించడంతో గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి చొరవతో శనివారం అంజయ్య మృతదేహం స్వగ్రామమైన మల్లారెడ్డిపేటకు చేరింది. అంజయ్య మృతదేహం ఇంటికి చేరగానే భార్య, వారి బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, కూతురు ఉంది.



అంజయ్య (ఫైల్)

వెల్దిలో జిలిటెన్ స్టిక్స్ పట్టివేత

మానకొండూర్, ఆగస్టు 3: అక్రమంగా తరలిస్తున్న జిలిటెన్ స్టిక్స్‌ను వెల్ది గ్రామంలో పట్టుకున్నట్లు సీఐ సదన్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కొరిటికల్ గ్రామానికి చెందిన ఒర్సు శ్రీనివాస్ అనే వ్యక్తి కొంతకాలంగా వీణవంక మండల కేంద్రంలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం వీణవంక నుంచి మండలంలోని వెల్ది గ్రామానికి 200 జిలిటెన్‌స్టిక్స్‌ను తరలిస్తున్నాడు. వాహనాల తనిఖీలో పట్టుకుని విచారించగా శంకరపట్నం మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన వంగ సత్యనారాయణ, హుజురాబాద్ మండలంలోని ఇప్పల నర్సింగాపూర్‌కు చెందిన జున్నోజు రాజేందర్‌ల వద్ద వాటిని కొనుగోలు చేసినట్లు శ్రీనివాస్ తెలిపాడని తెలిపారు.ఈ సంఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, రామడుగు, బోయినపల్లి, ఆగస్టు 3: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టులోకి 8,355 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరు రిజర్వాయర్‌లోకి నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఇప్పటి వరకు 8.5 టీఎంసీల నీటిని మిడ్‌మానేరుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.125 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 12600 క్యూసెక్కులు, మానేరు, మూలవాగు ద్వారా 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.5 టీఎంసీలకు ప్రస్తుతం 14.347 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.



రామడుగు వద్ద నిండుగా ప్రవహిస్తున్న గ్రావిటీ కెనాల్

శనివారం రాత్రి వరకు ఎస్సారెస్పీలోకి 17,925 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 43.091 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1 నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 37.352 టీఎంసీల నీరు వచ్చి చేరింది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 3: సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్‌కు చెందిన నందగిరి రాజశేఖర్ (31) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. హైద్రాబాద్‌లోని మియాపూర్‌లో గల ఓ లాడ్జ్‌లో శుక్రవారం రాత్రి రాజశేఖర్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోనరావుపేట మండలంలోని పల్లిమక్తకు చెందిన రాజశేఖర్ కుటుంబం ఉపాధికోసం సిరిసిల్లకు వలసవచ్చారు. సిరిసిల్లలోని గీతానగర్‌లో నివాసం ఉన్న రాజశేఖర్ తండ్రి గతంలోనే మృతిచెందాడు. హైద్రాబాద్‌లోని హైటెక్ సిటీలో గల ఓ కంపెనీలో రాజశేఖర్ ఎనమిదేళ్లుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశాడు. కొంత కాలంగా నెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న రాజశేఖర్ దాదాపు రూ.40లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హైద్రాబాద్‌కు తరలివెళ్లారు. రెండు నెలల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసిన రాజశేఖర్ అప్పులపాలు కావడంతో మనస్థాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడని మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మృతుడి తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియల కోసం మృతుడి అమ్మమ్మ స్వగ్రామమైన తంగళ్లపల్లి మండలంలోని తాడూరు గ్రామానికి తరలించారు.

ఖనిలో ఆంబోతుల వీరంగం

● టీవీ షోరూంలోకి దూసుకెళ్లిన ఎద్దులు



గోదావరిఖని లక్ష్మీనగర్‌లో పొట్లాటకు దిగిన ఆంబోతులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 3: గోదావరిఖనిలో జనం రద్దీ ఉండే ప్రదేశంలోనే ఎద్దులు పొట్లాటకు దిగుతుండడంతో అమాయకుల కాళ్లు, చేతులు విరుగుతున్నాయి. శనివారం నిత్యం రద్దీగా ఉండే గోదావరిఖని లక్ష్మీనగర్‌లో గంట పాటు ఆంబోతులు కొట్లాటకు దిగడంతో రెండు ఎలక్ట్రికల్ షాపులు, ఓ టీవీ షోరూమ్‌లో వస్తువులు, రోడ్లపై ఉన్న పలు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ప్రజలపై ఆంబోతులు దూసుకురావడంతో పరుగులు తీశారు. అక్కడ ఉన్న వారు వాటిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నం చేసినప్పటికీ అవి ఎంతకూ అక్కడి నుంచి వెళ్లిపోలేదు. ఓ టీషాపులోకి దూరి టీవీలను, ఫ్రిజ్‌లను ధ్వంసం చేశాయి. పశువుల భారి నుంచి కాపాడాలని ఎన్నిసార్లు కార్పొరేషన్ అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఏదో ఒక చోట పశువులు కొట్లాటకు దిగుతుండడంతో పలువురి కాళ్లు చేతులు కూడా విరిగిపోయిన ఘటనలు గోదావరిఖనిలో ఉన్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవాలని ప్రజలు, వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భర్త కాపురానికి తీసుకెళ్లాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న రుచిత కుటుంబ సభ్యులు, బంధువులు

కోరుట్ల రూరల్, ఆగస్టు 3: తనను కాపురానికి తీసుకెళ్లాలని మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో భర్త ఇంటి వద్ద భార్యతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన రుచితకు కోరుట్ల మండల గుమ్లాపూర్‌కు చెందిన బోయిన రమణతో 2024, ఫిబ్రవరి 14న వివాహం జరిగింది. భార్యపై అనుమానంతో రుచితను తన భర్త వేంపేటలోని పుట్టింట్లో వదిలి వెళ్లాడు. రుచిత తల్లిదండ్రులు పలు మార్లు కుల సంఘ పెద్దలతో పంచాయతీలు నిర్వహించి సముదాయించారు. దంపతులిద్దరినీ ఆసుపత్రిలో చూపించి వైద్యులతోనూ చెప్పించారు. చివరకు మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో రమణను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి రుచితను కాపురానికి తీసుకెళ్లడానికి ఒప్పించారు. రోజులు గడుస్తున్నా కాపురానికి తీసుకెళ్లకపోవడంతో శనివారం రుచితతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో గుమ్లాపూర్‌కు తరలి వచ్చి అత్తింటి ఎదుట బైఠాయించారు. సమాచారం తెలుసుకున్న రమణ అతని కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న కోరుట్ల 2వ ఎస్‌ఐ ఆరీఫ్ ఖాన్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో రుచిత బంధువులు ఆందోళన విరమించారు. కాగా పోలీసుస్టేషన్‌లో రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ దాడి

- అధికారులకు చిక్కిన తహసీల్దార్, డ్రైవర్, తాత్కాలిక ఉద్యోగి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 3: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. తహసీల్దార్ జాహెద్‌పాషాతో పాటు లంచం తీసుకుంటుండగా పట్టుబడిన డ్రైవర్ మహమ్మద్ అమ్జద్‌పాషా, తాత్కాలిక ఉద్యోగి దాసరి ధర్మేందర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఓదెల మండలం చిన్నకొమిరె గ్రామానికి చెందిన కడెం తిరుపతికి కాల్వశ్రీరాంపూర్ మండలం పందిళ్ల గ్రామ శివారు సర్వే నంబర్ 645లో 28గుంటల భూమి ఉంది. బ్యాంకు లోన్ కోసం పహాణి నకల్ అవసరం కావడంతో రూ.10 వేలు ఇవ్వాలని తహసీల్దార్ డిమాండ్ చేశాడు. ఈ విషయమై తిరుపతి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగి దాసరి ధర్మేందర్, డ్రైవర్ అమ్జద్‌పాషా తిరుపతి నుంచి రూ. 10 వేలు తీసుకుంటుండగా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. దాసరి ధర్మేందర్‌తో పాటు తహసీల్దార్ జహెద్‌పాషా, డ్రైవర్ మహమ్మద్ అమ్జద్‌పాషాలను అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. తిరుపతి తండ్రి పేరు మీద ఉన్న భూమిని విరాసత్ చేసేందుకు దాసరి ధర్మేందర్, అమ్జద్‌పాషాల ద్వారా రూ.50వేలు లంచం తీసుకున్న తహసీల్దార్ జాహెద్‌పాషా గత నెల 23న మ్యుటేషన్ చేశాడని తెలిపారు. ఇటీవల మ్యుటేషన్ కావడంతో బ్యాంకు లోన్ కోసం డాక్యుమెంట్లు, పహాణి నకలు మ్యాన్యువల్‌గా ఇవ్వాల్సి ఉన్నందున తహసీల్దార్ లంచం డిమాండ్ చేశాడన్నారు. దాసరి ధర్మేందర్, అమ్జద్‌పాషాల వాంగ్మూలం మేరకు తహసీల్దార్‌నుఅరెస్టు చేశామని తెలిపారు.



ఏసీబీకి చిక్కిన దాసరి ధర్మేందర్, తహసీల్దార్ జాహెద్‌పాషా, అమ్జద్‌పాషా

పాముకాటుతో ఒకరి మృతి

గన్నేరువరం, ఆగస్టు 3, మండలంలోని పారువెల్ల గ్రామానికి చెందిన గోకులకొండ రాజేశం(68) శుక్రవారం మధ్యాహ్నం తన ఇంటి వద్ద పాముకాటుకు గురై కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపారు. మృతుడి కుమారుడు తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

గన్నేరువరం, ఆగస్టు 3: మండలంలోని చీమలకుంటపల్లి గ్రామానికి చెందిన పొలవేని వీరయ్య(78) అనారోగ్యం కారణంగా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం. మృతుడు గతంలో చెట్టుపై నుంచి పడి వెన్నుముఖకు దెబ్బ తగలడంతో అనారోగ్యానికి గురై ఇంట్లోనే ఉంటున్నాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో మనస్థాపానికి గురైన వీరయ్య శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిరుత దాడిలో రెండు ఆవులు మృతి

గంభీరావుపేట, ఆగస్ట్ 3 : గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామ సమీప అడవుల్లోరి మెట్టె ఒర్రె ప్రాంతంలో శుక్రవారం రాత్రి రెండు ఆవులపై చిరుత పులి దాడి చేసింది. గోరంటాలకు చెందిన చంద్రం అనే రైతుకు చెందిన రెండు ఆవులను తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న కొట్టంలో కట్టేశాడు. శుక్రవారం రాత్రి కొట్టంలో ఉన్న రెండు ఆవులపై రుత దాడి చేసి చంపేసింది. ఉదయం ఎప్పటిలాగానే రైతు తన పొలం వద్దఉన్న కొట్టం వద్దకు వ్చ చూసే సరికి రెండు ఆవులు గాయాలతో చనిపోయి ఉన్నాయి. వెంటనే గ్రామస్తులకు చెప్పడంతో వారు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ డిప్యూటి రేంజ్ ఆఫీసర్ అంజలి, బీట్ ఆఫీసర్ రమేష్‌లు సంఘటన వద్దకు చేరుకుని పరిశీలించారు. చిరుత పులి దాడి వల్లే ఆవులు చనిపోయాయని ఫారెస్ట్ అధికారులు నిర్ధారించారు.

అడవిపిల్లి దాడిలో లేగ దూడ మృతి

చందుర్తి: మండలంలోని దేవుని తండాలో ఎర్ర చెరువు ప్రాంతంలో పశువుల పాకలో శుక్రవారం రాత్రి జంగిల్ క్యాట్ (జిత్రపులి) దాడిలో లేగ దూడ మృతి చెందింది. వట్టిమల్ల ఎఫ్ఎస్ఓ అన్వర్ హుస్సేన్ కథనం ప్రకారం.. సరిలాల్ అనే రైతు రోజు మాదిరిగానే లేగ దూడను పశువుల పాకలోకి తోలి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం పశువుల పాకకు వెళ్లి చూడగా లేగదూడ మృతి చెంది ఉన్నది. దూడ మృతి చెందిన విషయం అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దాడి చేసింది.. చిరుత పులి కాదని జంగల్ క్యాట్ (జిత్రపులి) దాడిలోనే దూడ మృతి చెందిందని తెలిపారు.

రేపటి నుంచి శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం

ధర్మపురి, ఆగస్టు 3: ధర్మపురి క్షేత్రంలో ఈ నెల 5న సోమవారం నుంచి శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు సుదూర ప్రాంతాల నుంచి నిత్యం అనేక మంది భక్తులు క్షేత్రానికి చేరుకుంటారు. క్షేత్రంలో లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ దేవాలయాలు, పురాతన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయి. క్షేత్ర సమీపంలో పురాతన శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయం ఉంది. గోదావరి నదీ తీరాన గోదావరి మాత, సంతోషీమాత, పురాతన మహాలక్ష్మి, శివ సాయి బాలాజీ, శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయాలు ఉన్నాయి. శ్రావణ మాసంలో నిత్యం వివిధ ప్రాంతాల నుంచి చేరుకునే భక్తులు గోదావరిలో స్నానాలు చేసిన అనంతరం ప్రత్యేకంగా నది పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకుంటారు. నవదంపతులు జలప్రియుడు అయిన చిన్న గద్దె శివుడికి జలంతో అభిషేకం చేసి పూజిస్తారు. భక్తులు శ్రీ లక్ష్మీ నరసింహ, శ్రీ రామ లింగేశ్వర, శ్రీ అక్కపల్లి రాజ రాజేశ్వర స్వామి వారలను దర్శించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మాసంలో వచ్చే నాగుల పంచమి నాడు పాము పుట్టల్లో పాలు పోసి రాఖీ పౌర్ణమి రో జున యజ్ఞోపవీతధారణ జరిపి అనేక మంది భక్తులు శ్రీ సత్యనారా యణ స్వామి వ్రతాలు ఆచరిస్తారు. నెల రోజుల పాటు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీ లక్ష్మీ నరసింహుని ఆలయంలో పూజలు

శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ప్రధాన దేవాలయంలో స్వామి వారికి నెల రోజుల పాటు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. భక్తులు రూ.2,516 చెల్లిస్తే వారి పేరట నెల రోజుల పాటు అభిషేకం, పూజలు, సంకల్పం నిర్వహిస్తారు. ఉగ్ర నారసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, ప్రత్యేక భోగములు జరిపి రూ. 2,000 చెల్లిస్తే భక్తుల పేరట నెల రోజుల పాటు అభిషేకం, భోగములు, సంకల్పం నిర్వహిస్తారు. రామ లింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు రూ 516 చెల్లిస్తే వారి పేరట నెల రోజుల పాటు అభిషేకం నిర్వహిస్తారు.

అమెరికా ఫెలోషిప్‌నకు వీణవంక విద్యార్థిని ఎంపిక



ఫెలోషిప్‌నకు ఎంపికైన పావని

వీణవంక,ఆగస్టు3:అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించడనికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున వ్యవసాయ విద్యలో ప్రతిభావంతులైన నలుగురు విద్యార్థులను ఫెలోషిప్‌కు నలుగురిని ఎంపిక చేశారు. అందులో వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామానికి చెందిన మూల పావని ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల మాస్టర్స్ చదువులకు అయ్యే పూర్తి ఖర్చు భరిస్తుంది.ప్రతి విద్యార్థికి 55.50 లక్షల చొప్పున నలుగురికి 2.22 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను తల్లిదండ్రులను అభినందించారు. పావని కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేసింది. 2025-26 సంవత్సరంలో అమెరికాలో అబ్రమ్ యూని వర్సిటీ అలబామలో వారు మాస్టర్స్ పూర్తి చేస్తారని తెలిపారు. 2023-24, 2024-2025లలో డీగ్రి పూర్తి చేసిన బ్యాచ్‌కు ఇద్దరు చొప్పున ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పలువురు అభినందించారు.

వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టం అమలు చేయాలి

● వ్యవసాయ కూలీలకు రూ. 12 వేల భృతి చెల్లించాలి ● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

వేములవాడ టౌన్, ఆగస్టు 3 : రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు, గ్రామీణ కూలీలకు సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలో జరుగుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను చాడ వెంకట్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు కోసం కృషి చేయాలని, అందులో భాగంగానే వ్యవసాయ కూలీలకు రూ. 12 వేల భృతి చెల్లించాలని అన్నారు. ఆసరా పెన్షన్ ఇవ్వాలని, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి, రోజు పనిచేసే కూలీలకు రూ. 700 చెల్లించాలని, ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులతో పాటు సమ్మర్ అలవెన్స్ వెంటనే విడుదల చేయాలని, మున్సిపాలిటీలలో కూడా ఉపాధి హామీ పథకం అమలు చేయాలని అన్నారు. గ్రామాల్లో చాలా సంవత్సరాలుగా ప్రభుత్వాలు ఇళ్లు మంజూరు చేయకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మించి వున్న ఇళ్లను వెంటనే అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని అన్నారు. ప్రస్తుత పాలకులు వ్యవసాయ కూలీలకు, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కూలీబంధు పథకం అమలు చేయాలని, ఎన్నికల గ్యారంటీలలో భాగంగా ఇళ్లు లేని పేదలకు గృహజ్యోతి పథకం కింద రూ.5 లక్షలు ఇవ్వడమే కాకుండా ఇంటి స్థలం లేని వారికి స్థలం ఇచ్చి రూ.6 లక్షలు ఇవ్వాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో వున్న సాగు భూమి లేని వ్యవసాయ కూలీలకు, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వ భూములను పంపిణీ చేయాలని లేని పక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములు ఆక్రమణ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ శిక్షణ తరగతులలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాంతయ్య, నక్క బాలమల్లేష్, రాష్ట్ర నాయకులు కొయ్యాడ సృజన్‌కుమార్, తాటి వెంకటేశ్వర్లు, జంగయ్య, యేసు, లింగారెడ్డి, ఎగుర్ల మల్లేశం, గుంటి వేణు, కడారి రాములు తదితరులు ఉన్నారు.



వేములవాడ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

నకిలీ నోట్ల ముఠా అరెస్ట్

● రూ. 7 లక్షల నకిలీ కరెన్సీ, కారు స్వాధీనం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 3 (మెట్‌పల్లి): తక్కువ మొత్తం అసలు కరెన్సీ ఇస్తే ఎక్కువ మొత్తంలో నకిలీ కరెన్సీ ఇస్తామంటూ ఎర వేసి తీరా అసలు కరెన్సీతో పారిపోయి జల్సాలకు అలవాటు పడ్డ ఆరుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వరరావు తెలిపారు. శనివారం పట్టణంలో డీఎస్పీ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా తాళ్ల ధర్మారానికి చెందిన సంజీవ్, జగిత్యాల పట్టణానికి చెందిన శివకుమార్, నిర్మల్ జిల్లాకు చెందిన కిషన్, మల్లయ్య, గంగారం, అశోక్ అనే ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 7 లక్షల నకిలీ కరెన్సీ, ఒక కారు, ద్విచక్ర వాహనం, 6 సెల్‌ఫోన్‌లు, 5,050 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముఠా సంవత్సరకాలంగా ఇద్దరు చొప్పున ఒక ముఠాగా ఏర్పడి హైద్రాబాద్‌లో ముగ్గురిని, ధర్మపురిలో ఒకరిని, కరీంనగర్‌లో ఒకరిని, జన్నారంలో ఒకరిని, జగిత్యాలలో ఒకరి వద్ద నుంచి డబ్బులు కాజేశారు. లక్ష అసలు కరెన్సీకి రూ.4 లక్షలు నకిలీ నోట్లు ఇస్తామని వల వేశారు. ఇలా వల వేసి అక్కడకు వెళ్లిన తర్వాత సదరు వ్యక్తికి బ్యాగులో 4 లక్షల వరకు నకిలీ నోట్లను చూపి అతని వద్ద ఉన్న ఒరిజినల్ లక్ష తీసుకున్న తర్వాత పరారవుతూ మోసాలకు పాల్పడేవారని తెలిపారు. ఈ వ్యవహారంలో మొత్తం 10 లక్షల వరకు నిందితులు లాక్కొని పరారీలో ఉన్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న ముఠా సభ్యులు ఈ నెల 1న పట్టణ శివారులోని పెద్ద గుండు వద్ద స్థానిక దాబా యాజమాని వద్ద నుంచి లక్ష లాక్కొని పరారయ్యారు. యాజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, మెట్‌పల్లి ఎస్‌ఐ చిరంజీవి, రాజు గాలింపు చర్యలో భాగంగా శనివారం పట్టణంలోని వెంకట్రావుపేట దాబాలో గుర్తించి ఆరుగురిని అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించినట్లు తెలిపారు. నకిలీ నోట్ల ముఠాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ నిరంజన్‌రెడ్డిని, ఎస్‌ఐ చిరంజీవిని, రాజు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ అభినందించారు.



మాట్లాడుతున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు

పీఎం కిసాన్ జాబితా పేరిట లింకులు

● జోరుగా సైబర్ మెసేజ్‌లు

కరీంనగర్ రూరల్, ఆగస్టు3: కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్ గ్రామంలో రెండు రోజులుగా సైబర్ మోసగాళ్ల నుంచి వస్తున్న వాట్సాప్ మెసేజ్‌లు చూసి కంగుతింటున్నారు. రెండు రోజుల క్రితం నగునూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి పీఎం కిసాన్ లిస్ట్1 పేరుతో ఒక వాట్సాప్ మెసేజ్ వచ్చింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈ జాబితాలో తమ పేరు చూసుకోవడానికి అతడు మెసేజ్‌ను ఓపెన్ చేశాడు. అది ఓపెన్ కాక ఇన్‌స్టాల్ అడగటంతో దాన్ని ఇన్‌స్టాల్ చేశాడు. దీంతో వెంటనే ఫోన్ వాట్సాప్ కనబడకుండా పోయిందని బాధితుడు తెలిపాడు. అయితే అతడికి ఫ్లిప్‌కార్ట్ నుంచి బ్యాంకుల ఫోన్ పే ఓటీపీ నంబర్ కావాలని మెసేజ్ రావడంతో అనుమానం వచ్చిన అతను ఓటీపీ ఓపెన్ చేయలేదు. కానీ అతని ఫోన్ నెంబర్ నుంచి ఇతర వ్యక్తులకు, గ్రూపునకు అతని ప్రమేయం లేకుండానే మెసేజ్‌లు పోవడం గమనించారు. విషయం తెలుసుకున్న ఆ గ్రూప్ అడ్మిన్ అతన్ని తొలగించినా గ్రూప్‌లో ఉన్న వ్యక్తులకు మెసేజ్‌లు రావడం మొదలైంది. దాదాపు ఆగ్రూప్‌లో 250మంది ఉన్నారు. మొదటగా ఆ గ్రూప్‌లో ఆ మెసేజ్ పెట్టిన వ్యక్తి పేరిట కొంతమందికి ఇంకా మెసేజ్‌లు వస్తున్నాయి. కొంత మందికి ఓటీపీలు రావడం మరికొందరికి ఫోన్లు రావడంతో గ్రామంలో పలువురు ఆందోళన చెందుతున్నారు.

నేడు స్నేహితుల దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 3: మానవుడు అవసరాల కోసం ఇతరులపై ఆధార పడక తప్పదు. అన్ని బంధాల కంటే స్నేహ బంధం శాశ్వతంగా నిలుస్తుంది. కష్ట సుఖాలను, కలిమి లేములను పంచుకునేదే నిజమైన స్నేహం. అలాంటివారే నిజమైన స్నేహితులు. మన దేశంలో ప్రతి సంవత్సరం ఆగస్టు తొలి ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా శనివారం మార్కెట్‌లో సందడి నెలకొంది.

'సెయింట్ జార్జ్'లో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు

భగత్‌నగర్, ఆగస్టు 3: నగరంలోని సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల (సిబిఎస్‌ఈ), సెయింట్ జార్జ్ నినోస్ బ్లాక్ పాఠశాలల్లో ముందస్తు ఫ్రెండ్‌షిప్‌డే వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా సెయింట్‌జార్జ్ పాఠశాలల ఛైర్మన్ ఫాతిమారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు స్నేహభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ భార్గవ్, నిరంజన్, నినోస్ బ్లాక్ ఇన్‌ఛార్జి సంధ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేతన్న బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 3: నేతన్న బీమా పథకానికి అర్హులైన జిల్లాలోని చేనేత కార్మికులు, మరమగ్గాల కార్మికులు, అనుబంధ కార్మికులు ఈనెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుడు ఎస్.చరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో నమోదైన కార్మికులు ఏదైనా కారణంతో మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సహాయం అందుతుందన్నారు. 18 నుంచి 59 సంవత్సరాలలోపు చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులు చేనేత జౌళిశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ధర్నా

గణేష్‌నగర్, ఆగస్టు 3: బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో శనివారం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం శాతవాహన యూనివర్సిటీ ఇన్‌ఛార్జి చుక్క శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన జాబ్‌క్యాలెండర్ సత్యదూరంగా ఉదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వొడ్నాల రాజు, నారదాసు వసంతరావు, బొంకూరి మోహన్, మహ్మద్ అఫ్రోజ్‌ఖాన్, అన్వేష్, సాయికుమార్, శశాంక్, మామిడిపల్లి సాయికుమార్, కృష్ణ, పవన్, అంజన్, థామస్, వివేక్, వెంకటేష్, సాదిక్, మియాల్, కార్తిక్ పాల్గొన్నారు.

తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగించొద్దు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 3: తెలుగు విశ్వవిద్యాలయానికి ఉన్న పొట్టి శ్రీరాములు పేరును తొలగించి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని అసెంబ్లీలో పెట్టిన ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని ఆర్యవైశ్య మహాసభ పట్టణ సంఘం అధ్యక్షుడు నగునూరి శేఖర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణకు అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన పేరును ఏదైనా కొత్త ప్రాజెక్టుకు పెట్టి సముచిత స్థానం కల్పించాలన్నారు. తెలుగు విశ్వవిద్యాలయానికి ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు తొలగించవద్దని ఆయన కోరారు.

●తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం సరికాదని గాంధీ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షుడు భాస్కర్ ఒక ప్రకటనలో అన్నారు.

పాఠశాలల్లో రెయిన్ డే వేడుకలు



రెయిన్ డే లో పాల్గొన్న వింధ్యావాలి విద్యార్థులు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 3: నగరంలోని మెహర్‌నగర్ వింధ్యావాలి పాఠశాలలో శనివారం రెయిన్ డే వేడుకలు అలరించాయి. వేడుకలను ఛైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశరావు ప్రారంభించారు. నర్సరీ నుంచి రెండవ తరగతి వరకు చిన్నారులు గొడుగులు, రెయిన్ కోట్స్ ధరించి వర్షంలో తడుస్తూ చిందులు వేశారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి.ప్రశాంత్ పాల్గొన్నారు.

● నగరంలోని హనుమాన్‌నగర్ బ్లూబెల్స్ పాఠశాలలో రెయిన్ డే వేడుకలు అలరించాయి. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రిన్సిపాల్ జంగ సునీతామనోహర్‌రెడ్డి వివరించారు.

అంబేద్కర్ స్టేడియంలోని సమస్యలు పరిష్కరించండి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 3: నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో అనేక సమస్యలు నెలకొన్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని శుక్రవారం మున్సిపల్ అదనపు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్ళుగా బీఆర్‌ఎస్ పాలనలో అంబేద్కర్ స్టేడియాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు అసోసియేట్ ఛైర్మన్, డిసిసి అధికారప్రతినిధి గడ్డం విలాస్‌రెడ్డి, బ్యాంకు పిఐసి సభ్యుడు ముక్క భాస్కర్, సిటి కాంగ్రెస్ అధికార ప్రతినిధి సర్దార్ ధనుసింగ్, బత్తిని చంద్రయ్య పాల్గొన్నారు.

సబ్ జైలును పరిశీలించిన జిల్లా జడ్జి

హుజూరాబాద్, ఆగస్టు 3: హుజూరాబాద్ సబ్‌జైలును జిల్లా జడ్జి ప్రతిమ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అండర్ ట్రయల్ ఖైదీలను వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన ఆహారాన్ని ఖైదీలకు అందించాలని జైలు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి కుమార్ వివేక్, న్యాయ సేవా సమితి ఛైర్మన్, సబ్ జడ్జీ కె వెంకటేష్, మొదటి అదనపు జడ్జీ పద్మసాయిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేడు హుజూరాబాద్‌లో విద్యుత్ అంతరాయం

హుజూరాబాద్, ఆగస్టు 3: హుజూరాబాద్ పట్టణంలోని పలు కాలనీల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హుజూరాబాద్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం గణేష్‌నగర్, మామిండ్లవాడ, అన్నపూర్ణ థియేటర్, జమ్మికుంట రోడ్, సూపర్‌బజార్ రోడ్, రెడ్డికాలనీ, కేరళ స్కూల్ రోడ్‌లలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అర్కండ్ల వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కేంద్ర మంత్రికి వినతి

శంకరపట్నం, ఆగస్టు 3: శంకరపట్నం మండలం అర్కండ్ల వాగుపై బ్రిడ్జి నిర్మించాలని మాజీ ఉపసర్పంచ్ చర్ల శ్రీనివాస్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. శంకరపట్నం మండల నుంచి వీణవంక మండలానికి వెళ్లేందుకు ప్రధాన మార్గం ఇదే కావడం, అర్కండ్ల రైతులకు వాగు అవతల వ్యవసాయ భూములు ఉండడంతో నిత్యం లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వెళ్లాల్సిందేనన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు.

ఎంపీ ఈటలను కలిసిన నాయకుడు

శంకరపట్నం, ఆగస్టు 3: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం శంకరపట్నంకు చెందిన హుజూరాబాద్ డివిజన్ తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ షఫీయొద్దీన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో చాంద్, సర్దార్, షామోహిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట, ఆగస్టు 3: ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు. జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామ శివారులో మానేరు పరివాహన ప్రాంతం నుంచి ఇల్లందకుంట మీదుగా కనగర్తి గ్రామానికి తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 3: మండలంలోని రాంపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని ఉద్యమం చేయటం మూలంగానే సుప్రీంకోర్టు చారిత్రత్మాక తీర్పును వెలువరించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మాడుగుల ఓదెలు, రుద్రారపు రాంచంద్రంమాదిగ, గౌడ సంఘం నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ పొడిశెట్టి వెంకట్రాజం, ఎలబోతారం మాజీ సర్పంచ్ నమిండ్ల రవీందర్, వేల్పుల రత్నం, అసిస్టెంట్ ప్రొఫెసర్ తడికమల్ల శేఖర్ తదితరులు ఉన్నారు.

మానసిక వికలాంగుల పాఠశాలకు సామగ్రి వితరణ

తిమ్మాపూర్, ఆగస్టు3:మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ మానసిక వికలాంగుల పాఠశాల వృత్తి శిక్షణ కేంద్రంలో శనివారం సురభి వెల్ఫేర్ అసోసియేషన్ కరీంనగర్ వారి ఆధ్వర్యంలో మానసిక వికలాంగుల పాఠశాలకు ఆటవస్తువులు, వంట సామగ్రితో పాటు బియ్యం పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సతీమణి కాంతకుమారి హాజరై సామగ్రిని పంపిణీ చేశారు.

నేరాల నిరూపణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు3: నేరాల నిరూపణలో, నిందితులకు శిక్షపడడంలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు కీలకపాత్ర ఉంటుందని పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం పోలీసులు, జిల్లాలోని అన్ని కోర్టులకు చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వివిధ ఘటనల్లో నిందితులపై నమోదైన కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదు నుంచి కేసు విచారణ, కోర్టులో వచ్చే ట్రయల్, క్రైమ్ డీటెయిల్ ఫారం, ఛార్జ్‌షీట్‌లలో దొర్లే పొరపాట్లను సరిచేస్తూ సదరు పోలీస్ అధికారులకు సూచన చేయడం, పోలీసు అధికారులు సాక్షులను ప్రవేశపెట్టడం తదితర అంశాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించారు. కేసులు వీగిపోకుండా సరైన పద్ధతిలో ఇరువురి సమన్వయంతో నిందితులకు శిక్షంపబడేలా కృషి చేయాలన్నారు. సైబర్ క్రైమ్ నేరాల్లో తస్కరించబడిన సొమ్మును ఫ్రీజ్ చేస్తామని, ఆ సొమ్మును బాధితులకు అందజేయుటలో సంబం ధిత మేజిస్ట్రేట్‌ల అనుమతి ద్వారా బాధితులకు త్వరితగతిన అందజేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్‌లో వుండి సీసీ నెంబర్లు రాని కేసులకు సీసీ నంబర్లు తీసుకోవాలని తెలిపారు. దేశ వ్యాప్తంగా అమలవుతున్న నూతన చట్టాలను అమలుచేసే సమయంలో పోలీసు అధికారులకు ఏర్పడే సందేహాలను నివృత్తి చేయాలని కోరారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణతో పాటు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వి.లక్ష్మిప్రసాద్, ఏసీపీలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

510 జీవోను వెంటనే సవరించాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 3: 510 జీవోను సరిచేయాలని నేషనల్ హెల్త్‌మిషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు శాతల్ల సాగర్ కోరారు. వైద్య ఆరోగ్యశాఖలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న ఉద్యోగులకు గత ప్రభుత్వం 2018లో 510 జీవోతో 8 కార్యదర్శులకు మాత్రమే వేతనాలు పెంచారని, మిగతా 70 క్యాడర్లకు వేతనాలు పెంచలేదని ఆరోపించారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబంలో అర్హతను బట్టి ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు నెలకు రూ.25,000 పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు.

కేంద్ర మంత్రికి ఎమ్మార్పీఎస్ నేతల కృతజ్ఞతలు

సుభాష్‌నగర్, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం తీర్పును ఇచ్చినందుకుగాను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఎంఆర్‌పీఎస్ నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా వ్యవహరించిందన్నారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా అధికార ప్రతినిధి దండు అంజయ్య, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నవీన్ తదితరులు ఉన్నారు.

సమ్మె విరమించిన ఆసుపత్రి కార్మికులు

సుభాష్‌నగర్, ఆగస్టు 3: పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ జిల్లా ఆసుపత్రి సానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డు చేస్తున్న సమ్మె విరమించినట్లు ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయూసీసీ) గౌరవాధ్యక్షుడు బండారి శేఖర్ తెలిపారు. కార్మికులు రెండు రోజులపాటు సమ్మె చేసి రెండు నెలల జీతాలు సాధించుకున్నారని, మరో వారం రోజుల్లో మరో నెల జీతం ఇస్తామని హామి ఇచ్చిన్న జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి హామీ మేరకు సమ్మె విరమించినట్లు పేర్కొన్నారు.

వయనాడ్ బాధితులను ఆదుకోవాలి

భగత్‌నగర్, ఆగస్టు 3: వయనాడ్ బాధితులను కేంద్రం ఆదుకో వాలని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని టవర్ సర్కిల్, ప్రకాశం గంజ్ ప్రాంతాల్లో వరద బాధితులకు అండగా విరాళాలు సేకరించారు. గంట వ్యవధిలో సేకరించిన 4511 రూపాయలను కేరల సీఎం సహాయ నిధికి పంపిస్తామన్నారు.

బడ్జెట్ ప్రతుల దహనం

భగత్‌నగర్, ఆగస్టు 3: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు శనివారం సీపీఐ కార్యాలయం వద్ద దగ్ధంచేశారు. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి 2023-24 కేటాయించిన నిధులకంటే 2024-25లో కేటాయింపులు తక్కువ చేశారన్నారు. రైతు భరోసా 15 ఎకరాలరైతులకు కౌలు రైతులకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కంజర భూమయ్య కేదారి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అందె స్వామి, ఉమ్మెత్తల రవీదర్‌రెడ్డి, రాంరెడ్డి, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, కాంతాల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

భగత్‌నగర్, ఆగస్టు 3: నగరంలోని వల్లంపహాడ్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పుష్పలత, టీచర్ కనకలక్ష్మి పాల్గొన్నారు.

●గణేష్‌నగర్: కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు సప్తగిరి కాలని, సంతోష్‌నగర్ సెక్టార్‌లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి సరస్వతి, డాక్టర్ అఖిల, సిడిపిఓ ఉమారాణి, సూపర్‌వైజర్ స్వప్న పాల్గొన్నారు.

●గంగాధర: మధురానగర్ గ్రామపరిధిలోని పత్తికుంట పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పాలు, బ్రెడ్లు, పండ్లను ఇచ్చారు. కార్యక్రమంలో గంగాధర మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రవణ్, పాల్గొన్నారు.

●తిమ్మాపూర్: మండలంలోని రేణికుంట, ఎల్ఎండి కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సతాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సిడిపివో శ్రీమతి, పల్లె దవాఖాన డాక్టర్ జుబేరియా పాల్గొన్నారు.

●గన్నేరువరం: మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రామానుజాచారి, ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 3: ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. శనివారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అల్ఫోర్స్ ఛైర్మన్ డాక్టర్ వినరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయిపోటీల్లో బంగారు, రజత, కాంస్యపతకాలతో పాటు, మెడల్స్ ఆఫ్ ఎక్సెన్స్ సాధించడం అభినందనీయమన్నారు.

●విద్యార్థుల క్షేత్ర పర్యటన

వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ బాలికల ఇ-టెక్నో పాఠశాల ఏడవ తరగతి విద్యార్థినులు కొత్తపల్లిలోని చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి క్షేత్రాన్ని శనివారం సందర్శించారు.

క్షేత్ర పర్యటనలో భాగంగా విద్యార్థులు వస్త్ర తయారీ విధానం, ముడి సరుకు రంగుల అద్దకం, మరమగ్గాలు, చేనేత కార్మికుల కష్ట నష్టాలను గురించి తెలుసుకున్నారు.

'బీసీ కుల గణన చేపట్టాలి'


ఆందోళన చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

గణేష్‌నగర్: బీసీ కుల గణన చేపట్టాలని శనివారం తెలంగాణ చౌక్‌లో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సరోజ, సత్య నారాయణ, జమ్మికుంట మండల ప్రెసిడెంట్ స్వరూప, మండల ఇన్‌చార్జి రేణుక, హుజూరా బాద్ టౌన్ ప్రెసిడెంట్ దేవేంద్ర, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు: మంత్రి పొన్నం


మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి, అగస్టు 3: ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని బీసీ సంక్షేమ శాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని ఉల్లంపల్లి, సుందరగిరి, చిగురుమామిడి, గాగిరెడ్డిపల్లి, ఇందుర్తి, సీతారాంపూర్, ముది మానిక్యం, బొమ్మనపల్లి గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన మృతుల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా నియోకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకరావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు కానవేని శివకుమార్, బోయిని వంశీకృష్ణ, సత్యనారాయణ, బోయిని వేణు. ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, చిట్టుమల్ల రవీందర్, ఎలంగదుల లక్ష్మణ్, సయ్యద్ అలీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లంపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సందర్శించారు. పాఠశాలకు ప్రహరీ, ఇతర సమస్యలను స్థానిక నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మంత్రిని సన్మానించారు. ఉల్లంపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన దాసారపు దామోదర్, కోల మునవ్వల కుటుంబ సభ్యులను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన అలువాల లచ్చవ్వ అనే మహిళ తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం సక్రమంగా లేదని సమస్య పరిష్కరించాలని మంత్రిని కోరింది. గ్రామంలోని అన్ని సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి గ్రామస్థులకు తెలిపారు.

● సైదాపూర్: సైదాపూర్ మండలంలోని పలు గ్రామాలలో ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబాలను శనివారం బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. దుద్దెనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్ తల్లి గుండారపు కనుకవ్వ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను, సైదాపూర్ గ్రామానికి చెందిన అనగోని లక్ష్మి, లక్ష్మయ్య భార్య భర్తలు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను, జాగీర్‌పల్లి గ్రామానికి చెందిన సైదాపూర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు, ఆంధ్రజ్యోతి రిపోర్టర్ బండారి గట్టయ్య, ప్రైమ్9 న్యూస్ రిపోర్టర్ బండారి కుమారస్వామిల తల్లి బండారి భూమక్క మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.మంత్రి వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మిట్టపెల్లి కిష్టయ్య, జిల్లా అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్, కాంగ్రెస్ నాయకులు చాడ కొండాల్‌రెడ్డి, కూతురు విద్యాన్ రెడ్డి, బొమ్మగాని రాజు, లంకదాసరి మల్లయ్య, కంకణాల చంద్రారెడ్డి, కస్తూరి సమ్మయ్య, కొండ మల్లయ్య తదితరులున్నారు.

గౌరవెల్లికి నిధుల కేటాయింపుపై రైతుల హర్షం


రామంచలో సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

చిగురుమామిడి,అగస్టు 3: గౌరవెల్లి పాజెక్టు పనుల కోసం రూ.437 కోట్ల నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ల చిత్రపటాలకు శనివారం మండలంలోని రామంచ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ, రైతుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాగునీరు లేక ఈ ప్రాంత రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు లేరన్నారు. సాగునీరు అందించాలని ప్రాజెక్టు పనులకు నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు వంటకాల సంపత్‌రెడ్డి, ఐలయ్య, కాత తిరుపతి, ముల శ్రీనివాస్‌గౌడ్, కొండ కనుకయ్య, గుంటి ఎల్లయ్య, దాసరి సాంబయ్య, దొబ్బల తిరుపతి, బిక్షపతి, ముంజ మల్లేశం, చెరుకు శ్రీనివాస్, గట్టు శ్రీనివాస్, పైన పోచయ్య, చెరుకు రాజయ్య ఉన్నారు.

స్వచ్ఛదనం- పచ్చదనంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

గంగాధర, ఆగస్టు 3: ప్రత్యేకంగా నిర్వహించనున్న స్వచ్ఛదనం,పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలని జడ్పీ సీఈవో శ్రీనివాస్ సూచించారు. శనివారం ఈనెల 5నుంచి నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాల వివరాలపై సమీక్ష నిర్వహించారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ఇంటింటికి మొక్కల పంపిణీ చేయాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అన్ని విభాగాల అధికారులతో పాటు ప్రజలను, స్వచ్ఛ సంస్థలను భాగస్వామ్యులను చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జనార్ధన్‌రెడ్డి, డీటీ వినయ్‌కుమార్,అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సతీమణికి నివాళులర్పించిన నాయకులు


నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి , ప్రభుత్వ విప్

చొప్పదండి, ఆగస్టు 3: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి స్వర్గీయ రూపాదేవికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నివాళులర్పించారు. శనివారం చొప్పదండిలో జరిగిన రూపాదేవి సంస్మరణ సభకు ఆయన హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మైనంపెల్లి హన్మంతరావు, సిరిసిల్ల కలెక్టర్, ఎస్పీలు రూపాదేవికి నివాళులర్పించారు. నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సభకు హాజరై నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేష్‌నగర్, ఆగస్టు 3: నగరంలోని 11 కెవి మెహర్‌నగర్, వరలక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9.30 గంటల నుండి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్‌ఏడిఈ సాయినేని నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని మెహర్‌నగర్, సీతారాంపూర్‌లోని పలు ప్రాంతాలు, డిమార్ట్, వరలక్ష్మీనగర్, రెడ్డి ఫంక్షన్ హాలు వెనుక వైపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

జ్వరంతో యువకుడి మృతి

కరీంనగర్ రూరల్, ఆగష్టు3: కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలో విషజ్వరంతో ఇరుకుల్ల అజయ్(33) అనే వ్యక్తి శనివారం మృతిచెందాడు. నాలుగు రోజుల కిందట జ్వరం రావడంతో కరీంనగర్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందాడు. గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గ్రామంలో ఇటీవల డెంగ్యూ ప్రబలుతున్న నేపథ్యంలో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

నిరుద్యోగులను పట్టించుకోని బీఆర్ఎస్

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 3: పదేళ్ల పరిపాలన కాలంలో బీఆర్ఎస్ నిరుద్యోగులను పట్టించుకున్న పాపాన పోలేదని, ఉద్యోగాలు అసలు భర్తీ చేయలేదని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో విడుదల చేసిందని పేర్కొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం'

సుభాష్‌నగర్, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల సంఘాల నాయకులు మేడి మహేశ్, కాడ శంకర్ అన్నారు. శనివారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం వర్గీకరణ చేయరాదని అన్నారు.

బీసీల డిమాండ్ల సాధనకు పోరాటం

భగత్‌నగర్, ఆగస్టు 3: బీసీల డిమాండ్ల సాధన కోసం బీసీలు ఐక్యంగా పోరాటం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రా అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. శనివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బీసీ హక్కుల సాధనసమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ల బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, దేశ కులగుణలో బీసీ కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు జరిపి బీసీలకు 20 వేల కోట్లు కేటాయించాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి స్థానిక ఎన్నికలు జరుపాలన్నారు. సమావేశంలో కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, జంగ కొమురయ్యయాదవ్, వీసం మల్లేశం యాదవ్, గుంటి రాజు, పిట్టలనర్సయ్య జి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు వైశ్యభవన్‌లో సమావేశం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 3: నగరంలోని వైశ్యభవన్‌లో స్వామి వివేకానంద విద్యాపరిషత్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం దేవాలయాల ఏకీకరణ-హైందవ చైతన్య వేదిక అంశంపై సమావేశం ఏర్పాటు చేసినట్లు ఛైర్మన్ కనకమల్లు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధ్యాయుడిని పరామర్శించిన కేంద్ర మంత్రి

భగత్‌నగర్, ఆగస్టు 3: నగరంలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు జున్నుతుల శశిధర్‌రెడ్డిని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం పరామర్శించారు. ఈ కార్యక్ర మంలో సుధాకర్, బీజేపీ నాయకులు నరహరి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

మాతాశిశు ఆరోగ్య కేంద్రం సందర్శన

సుభాష్‌నగర్, ఆగస్టు 3: జిల్లా ఆసుపత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు శనివారం సందర్శించారు.

శనివారం కాన్పు అయిన వారితో పాటు ఒక రోజు, రెండు రోజుల ముందు కాన్పు అయిన తల్లులతో మాట్లాడారు. తల్లిపాల విశిష్టత గురించి వారికి వివరించారు. తల్లి పాలతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారన్నారు.

● సంక్షిప్త సమాచారం..

శంకరపట్నం, ఆగస్టు 3: తప్పుడు పత్రాలతో చేసిన భూమి విరాసత్ రద్దు చేసి తమకు న్యాయం చేయాలని శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు పొద్దుటూరి శంకరమ్మ, తన కూతుళ్లు, బంధువులతో కలిసి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కు శనివారం ఫిర్యాదు చేశారు.

● శంకరపట్నం: మండల ఎంపీవోగా ప్రభాకర్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కృష్ణప్రసాద్, కేశవపట్నం పంచాయతీ కార్యదర్శి నర్సయ్య తదితరులు సన్మానించారు.

● ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల ఎంపీవోగా రాజేశ్వర్‌రావు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన వెంకటేశ్వర్లు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో రాజేశ్వర్‌రావు బాధ్యతలు స్వీకరించారు.

● జమ్మికుంట: కేరళ వరద బాధితులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి అన్నారు. వరద బాధితులకు అండగా జమ్మికుంటలో చేపట్టిన విరాళాల సేకరణలో మాట్లాడారు.

● హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అంజనేయ రావు శనివారం బాధ్యతలు చేపట్టారు.

● హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఏ.జాన్సన్ డాక్టరేట్ అందుకున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ తెలిపారు.

● రామడుగు: ఆర్థిక ఇబ్బందులతో తనువు చాలిస్తున్న నేతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుంకెరవిశంకర్ అన్నారు. శనివారం మండలంలోని షానగర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన చేనేత కార్మికుల కుటుంబాలను పరామర్శించారు. కోరటపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మన్నె దర్శన్‌రావు తండ్రి మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు.

● చొప్పదండి: మండలంలోని వెదురుగట్టకు గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త జిల్లాల శంకరయ్య ఇటీవల ప్రమాదంలో మృతిచెందగా శనివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

● హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో పచ్చదనం-స్వచ్ఛదనం కార్యక్రమం అమలుపై సమీక్ష సమావేశం శనివారం జరిగింది. ఎంపీడీవో సునీత , ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోలు ఉన్నారు.

- రామడుగు: ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛదనం-పచ్చదనంపై సమీక్ష సమావేశం జరిగింది. మండల ప్రత్యేకాధికారి అనిల్ ప్రకాష్ కిరణ్ పాల్గొన్నారు.

● చొప్పదండి: మండలంలోని రాగంపేటలో శ్రీ పరంజ్యోతి సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలో ప్రజలకు సామాజిక అంశాలపై సీఐ తిరుమల్ శనివారం అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, డ్రగ్స్, గంజాయి నిర్మూలన అంశాలపై అవగాహన కల్పించారు.గ్రామంలో ఘర్షణ వాతావరణం సృష్టించే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.